www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 130 గురువారం, సెప్టెంబర్ 24, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి

మిగతా2లో...

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించింది.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయించారు.సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణ

మిగతా2లో...



## రైతుల పోరాటం ఫలించింది..

- జూరాల కాలువలకు నీటి విడుదల
కుడి, ఎడమ కాలువలకు సాగునీరు.. కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటికి హామీ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాగునీటి కోసం జూరాల ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళన

మిగతా2లో...

## ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు లిలి'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'లిలిను ప్రారంభించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ మీ సేవ కేంద్రాలతో పాటు 5,400కు పైగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మీ సేవ కేంద్రాల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు.ఇకపై ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. మీ సేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా ఇంటికి వచ్చి అవసరమైన సేవలను అందించనున్నారు.

మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్
ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకు న్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చా ర్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు

మిగతా2లో...

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

అశ్వాపురం రైతుల చిరకాల స్వప్నం సాకారం
'మారేళ్లపాడు ఎత్తిపోతల'ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
తొలి విడతలో 4,300 ఎకరాలకు.. దశలవారీగా 23 వేల ఎకరాలకు సాగునీరు




## జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

- బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్
- గురుదక్షిణ కింద తెలంగాణ వాటాను ఆంధ్రాకు ధారాదత్తం



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సా గునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ద మ్ముంటే మూడేళ్లల్లో కృష్ణ, గోదావరి జలాలు ఎంత వినియోగమయ్యాయో శ్వేతపత్రం ప్రక టించాలని బీఆర్‌ఎస్ ఎల్పీ ఉపనాయకుడు త న్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుదక్షి ణ కింద కృష్ణ, గోదావ రి జలాలను ఆంధ్ర ప్రాం తానికి ధారాదత్తం చేయడం తప్పా రైతాంగాని కి ప్రయోజనం చేకూరిన అంశం ఒక్కటి

మిగతా2లో...

## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత
జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం
నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోవిద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్‌ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్

మిగతా2లో...

## మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ






## దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

తుంగతుర్తికి దేవాదుల జలాలు తీసుకొస్తాం..
ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** గోదావరి, దేవాదుల ప్రాజెక్టుల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీటిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి ఉత్తమ్

మిగతా2లో...

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# రైతుల పోరాటం ఫలించింది..

(మొదటి పేజీ తరువాయి)

ఫలించింది. వారం రోజులుగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు చేస్తున్న పోరాటం నేపథ్యంలో బుధవారం జూరాల రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.పంట కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన చేపట్టగా, గత రెండు రోజులుగా నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే జూరాలలో నీరు ఉందని అధికారులు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. **కర్ణాటక నుంచి నీటికి హామీ**జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కర్ణాటకకు వెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 రోజులపాటు రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తామని డీకే శివకుమార్ హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. **2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కుడి, ఎడమ కాలువల వద్దకు చేరుకుని తూములను తెరిచి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే స్పిల్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. **రైతుల్లో ఉపశమనం** సాగునీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో కాలువలకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటి విడుదలకు హామీ లభించడంతో జూరాల ఆయకట్టు సాగునీటి అవసరాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు.'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో' విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు.సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్ సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023–24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025–26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు' కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు.యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న రైతుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ కాలువపై నిర్మించిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అనంతరం గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలను అధిగమిస్తూ పనులు చేయిస్తున్న తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు అదనపు నిధులను సీఎం మంజూరు చేశారని, ఇల్లెందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతలపై సర్వేలు చేసి అంచనాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా జలాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. భూసేకరణలో రైతులు సహకరించాలని కోరారు. న్యాయమైన పరిహారం రైతులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు కృషి చేస్తున్నామని, భద్రాచలంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతలతో పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు నీరు అందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రబీలో తక్కువ నీటి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తామన్నారు. రూ.350 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించామని, పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పులుసుబొంత ప్రాజెక్టు భూసేకరణ, ప్రత్యామ్నాయ భూముల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తామన్నారు. బూర్గంపాడులో దొమ్మలవాగు రిజర్వాయర్‌పై ప్రజల అవసరాల మేరకు చర్యలు తీసుకుంటామని, గిరిజన గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ద్వారా అశ్వాపురంలో 24 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాల కల నెరవేరిందని, గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడం పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. తుమ్మల ప్రధాన కాలువకు లైనింగ్, 22 కి.మీ డిస్ట్రిబ్యూటరీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మణుగూరు రేగులగండి చెరువుకు నీరిస్తే 4 వేల ఎకరాల్లో మూడు పంటలు పండుతాయని, దొమ్మలవాగును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మారేళ్లపాడుతో పాటు జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టామని, పులుసుబొంత్‌కు కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ సహా 8 మండలాల్లో డిస్ట్రిబ్యూటరీల సర్వే 60 శాతం పూర్తయిందని, సీతమ్మసాగర్‌కు 600 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందని, రూ.46 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని దుయ్యబట్టారు. బుధవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం పేరు చెప్పి కాంగ్రెస్ నేతలంతా ప్రకృతిని నింది స్తున్నారని, పాలమూరు జిల్లాలో ప్రతీ ప్రాజెక్టు ను సందర్శిస్తే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు కన్పి స్తున్నాయన్నారు. కృష్ణానది జలాల వినియోగం లో ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 36 టీఎంసీల నీటిని తెలంగాణ సాగు భూములకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంకెల గారడీతో రైతాంగాన్ని మోసగించే ప్రయత్నం చే యడం ఏమాత్రం సహించరని విషయమన్నా రు. కేసీఆర్ చాలా దూరదృష్టితో కృష్ణ, గోదావరి జలాలపై లిఫ్టులు, రిజర్వాయర్లు నిర్మించారని, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ అధికారంలో ఎన్ని ఎకరాల సాగు భూములకు నీరందించారో వివ రాలతో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొం త జిల్లాలో ఎకరా పంట ఎండినా సహించబో మని ఇందుకోసం ఉద్య మిస్తామని స్పష్టం చే శారు. రాబోయే కాలంలో కృష్ణా, గోదావరి నదీ జలాలను మళ్లించే ప్రయత్నం చేస్తే మహోద్య మం తప్పదని హెచ్చరించారు. కేఎల్ఐ కింద ఆ యకట్టులో సింహభాగానికి, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదు ల, వట్టెం రిజర్వాయర్ల వరకు కృష్ణా జలాలను పంపింగ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావాలని, వేదిక వాళ్లే నిర్ణయించాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు.. తీరం వైపు తీవ్ర వాయుగుండం

### నేటి అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణంవైపు తీరం దాటే చాన్స్

### పలు రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** పశ్చిమ–మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావారణశాఖ తెలిపింది. గోపాల్‌పురం–కళింగ పట్టణానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా బలపడి బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.**ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు.**పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు" అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు.**కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. "జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు" అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో–ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో–ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు.**ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో–ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో–ఇన్‌చార్జిగా నియమించారు.**సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**న్యూయార్క్ సెప్టెంబర్ 23 :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం' అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు.'వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది' అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోసం సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గతంలో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిని సమీక్షించాలని భట్టి సూచించారు.ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను ప్రస్తుత 4 నుంచి 6 లేదా 8కు పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. మూడు రోజుల కార్యక్రమంగా మాత్రమే కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా పెట్టుబడులు, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీస్ శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర పౌర సేవలను డోర్ డెలివరీ ద్వారా అందించనున్నారు.తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.**ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా..** 365 టీఎంసీల నీటిని ఒక్క చుక్క కూడా వృథా కాకుండా వినియోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు నీటి లభ్యత, వినియోగంపై వివరాలు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశాలకు తావులేకుండా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.**తాటిపాముల అభివృద్ధికి కృషి** అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ

● అక్టోబర్ 1న వయోవృద్ధుల గుర్తింపు కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



బాలానగర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాష్ట్ర సాంఘిక, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో టెస్కాన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం హన్మకొండ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం రాష్ట్రంలోని వయోవృద్ధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వయోవృద్ధులకు అవసరమైన గుర్తింపు కార్డుల జారీ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రతినిధులు మంత్రితో చర్చించారు. వినతిపత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా వయోవృద్ధుల గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తన కార్యదర్శిని ఆదేశించారు. అక్టోబర్ 1న వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గుర్తింపు కార్డులను పంపిణీ చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా వినతిపత్రంలో ప్రస్తావించిన వయోవృద్ధుల ఇతర సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిశీలించి, సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. వయోవృద్ధుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.

# అపార్ట్‌మెంట్‌లో వైభవంగా వినాయక వేడుకలు

**గోదావరిలో బొజ్జ గణపయ్య నిమజ్జనం**
**పాల్గొన్న ఎస్ఆర్ఎం కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మాచిడి మహేందర్ గౌడ్**



రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్) రామగుండం ఎన్టీపీసీ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎస్ఆర్ఎం కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మాచిడి మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలిచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం లంబోదరుడి విగ్రహాన్ని భక్తుల భజన కీర్తనలు, మహిళల కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగించారు. భక్తుల జైజైకారాల మధ్య శోభాయాత్ర కంటిపాపలా సాగింది. అనంతరం గోదావరి నదికి చేరుకుని శాస్త్రోక్తంగా స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల సంస్కృతికి బీజాలు వేసింది బీఆర్ఎస్ పార్టీ.

ఎ. మదన్ మోహన్

● నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చేర్చుకుని.. నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ద్వంద్వ వైఖరి

● ప్రజల తీర్పును గౌరవించడం అన్ని రాజకీయ పార్టీల బాధ్యత....



బాలానగర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల సంస్కృతికి బీజాలు వేసింది బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఏ. మదన్ మోహన్ విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న విషయాలను మరచిపోయి, ప్రస్తుతం ఫిరాయింపులపై ఆ పార్టీ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన అన్నారు. మదన్ మోహన్ వివరాల మేరకు 2014--18 మధ్య కాలంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో కూడా పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం 2019లో కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలు తమ శాసనసభా పక్షాన్ని అప్పటి టీఆర్ఎస్ శాసనసభా పక్షంలో విలీనం చేయాలని స్పీకర్‌కు ప్రాతినిధ్యం సమర్పించారు.

**-- ఈ పరిణామంతో కాంగ్రెస్ శాసనసభా పక్షం బలహీనపడింది........**

ఈ పరిణామాల నేపథ్యంలో అప్పటి కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క తన పదవిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఫిరాయింపులపై భట్టి విక్రమార్క తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కూడా నమోదైంది.

**--- నాడు లేని సోయి.. నేడు ఎందుకు?......**

"అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకోవడం, ఇప్పుడు అదే ఫిరాయింపుల అంశాన్ని పట్టుకుని ఇతర పార్టీలను విమర్శించడం ఎందుకు?" అని మదన్ మోహన్ ప్రశ్నించారు. రాజకీయ పార్టీల వైఖరి ఒకే విధంగా ఉండాలని, అధికారంలో ఉన్నప్పుడు ఒక న్యాయం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో న్యాయం అనే ధోరణి ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందని అన్నారు.

**-- దేశవ్యాప్తంగా ఫిరాయింపులపై చర్చ.........**

మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీ పార్టీల్లో చోటుచేసుకున్న విభజనలు, ఎమ్మెల్యేల వైఖరిలో వచ్చిన మార్పులు, తదనంతరం ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీసిన పరిణామాలు పార్టీ ఫిరాయింపుల చట్టం అమలుపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని మదన్ మోహన్ అన్నారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లో కూడా పార్టీ మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, 2026 జూలై 9న తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మాజీ రాజ్యసభ సభ్యులు సుష్మితా దేవ్, సుఖేందు శేఖర్ రే, ప్రకాశ్ చిక్క బరైక్ బీజేపీలో చేరిన విషయం అధికారికంగా నమోదైంది. అనంతరం వారిని రాజ్యసభ ఉపఎన్నికలకు బీజేపీ అభ్యర్థులుగా ప్రకటించింది.

**'-- ఓటు చోరీ.. సీటు చోరీ.. పార్టీ చోరీ' అంటూ ఆరోపణలు.......**

"ఓటు చోరీ.. సీటు చోరీ.. పార్టీ చోరీ.." అంటూ దేశ రాజకీయ పరిణామాలపై మదన్ మోహన్ పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియ, ప్రజా తీర్పు, పార్టీ మార్పులు, ప్రభుత్వాల ఏర్పాటు వంటి అంశాల్లో జరుగుతున్న పరిణామాలు ప్రజల్లో రాజకీయ వ్యవస్థపై అనుమానాలు కలిగిస్తున్నాయని అన్నారు. అయితే ఇలాంటి ఆరోపణలను కేవలం రాజకీయ విమర్శలుగా కాకుండా సంబంధిత అధికారిక రికార్డులు, ఎన్నికల సంఘం వివరాలు, శాసనసభా రికార్డులు, న్యాయస్థానాల తీర్పులు, అందుబాటులో ఉన్న వాస్తవాల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**-- ప్రజా తీర్పును గౌరవించాలి..........**

ప్రజలు ఇచ్చిన తీర్పును రాజకీయ పార్టీలు గౌరవించాలని మదన్ మోహన్ సూచించారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించడం, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం నిలబెట్టడం, ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఫిరాయింపులపై రాజకీయ విమర్శలు చేసేటప్పుడు గతంలో ఆయా పార్టీలు అనుసరించిన విధానాలను కూడా ప్రజలు పరిశీలిస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని మదన్ మోహన్ అన్నారు

# తప్పిపోయిన వృద్ధ మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

**చింతల్‌లో గుర్తించిన మహిళను సురక్షితంగా స్వగ్రామానికి చేర్చిన పోలీసులు**




సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్) చింతల్ ప్రాంతంలో తప్పిపోయి తిరుగుతున్న 70 ఏళ్ల వృద్ధ మహిళను పోలీసులు గుర్తించి, ఆమె కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. లక్ష్మి, భర్త రామయ్య, వయస్సు 70 సంవత్సరాలు, చింతల్ ప్రాంతంలో తిరుగుతుండగా స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన ఏఎస్ఐ లక్ష్మీ నరసయ్య వృద్ధ మహిళను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, ఆమెను ఆప్యాయంగా విచారించి కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. ఆమె చెప్పిన వివరాల ఆధారంగా జగదేవ్‌పూర్ మండలం పి.వెంకటాపూర్ సర్పంచ్‌ను పోలీసులు సంప్రదించారు. వారి సహకారంతో వృద్ధ మహిళ మనుమడి ఫోన్ నంబర్‌ను సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో లక్ష్మిని వారికి సురక్షితంగా అప్పగించారు. తప్పిపోయిన వృద్ధ మహిళను గుర్తించి కుటుంబ సభ్యులకు చేర్చడంలో పోలీసులు చూపిన చొరవపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వినాయకుడిని దర్శించుకున్న పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్

**-- మూసాపేటలో ఘనంగా ప్రత్యేక పూజలు.. పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు**



బాలానగర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ న్యూస్) కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట డివిజన్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మూసాపేటలోని పెద్ద వినాయకుడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపం కమిటీ సభ్యులు తూము వేణు ఆహ్వానం మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేందర్, సమతా నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపాలను నాయకులు సందర్శించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు మండపాల వద్దకు చేరుకుని విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ నాయకుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, సత్యం శ్రీరంగం, ప్రతాప్‌రెడ్డి, కొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, నాగేశ్వర్‌రావు, నరేష్‌కుమార్, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకటేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. వినాయక ఉత్సవాల సందర్భంగా కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాలు భక్తులతో సందడిగా మారాయి. నాయకులు, ప్రజాప్రతినిధులు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతో భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. నిర్వాహకులు ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు

# ఘనంగా ఎస్పీ జన్మదిన వేడుకలు

**ఎస్పీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది**




మెదక్ సెప్టెంబర్ 23( జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమక్షంలో ఎస్పీ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులు ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది చూపిన ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# పెద్ద కందుకూరులో ఉచిత మెడికల్ క్యాంప్.



**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 23**
యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో మాజీ సర్పంచ్ భీమ గాని రాములు గౌడ్, మాధవి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వారి కూతురు దివంగత తేజస్విని పేరు మీద తేజస్సుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ భీమ గాని రాములు గౌడ్ మాధవి పదవిలో ఉన్న లేకపోయినా ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతున్నారని అన్నారు. వారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మెడిసిటీ హాస్పిటల్ కు చెందిన వైద్య బృందం గ్రామానికి చెందినటువంటి రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇంకా అవసరమైన చికిత్స ఏమైనా ఉంటే హైదరాబాదులో వారికి చికిత్సలు అందిస్తామని వైద్యులు తెలిపారు. సమావేశంలో స్వామి వనజ స్రవంతి నరేష్ రాజశేఖర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.బ

# ప్రశాంత గణేష్ నిమజ్జన శోభాయాత్రకై పోలీసుల మార్గదర్శకాలు: బాలానగర్ ఏసీపీ పింగిలోకి నరేశ్ రెడ్డి

**బాలానగర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ న్యూస్)**
ఈ నెల 25వ తేదీన జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులు పలు ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముగిసేందుకు.. భద్రత, పౌర సదుపాయాల పర్యవేక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ సుమారు 200 మందిపైగా పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. సైబరాబాద్ పోలీస్, సిఎంసీ, హైడ్రా, టిజిఎస్పీడీసీఎల్, జలమండలి సమన్వయంతో చేపట్టిన నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు, ?శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా నిర్వాహకులకు పోలీసుల ముఖ్యమైన, కీలక మార్గదర్శకాలు చేశారు.మండపాల వద్ద నిర్వహించే అన్నదానాలు, లడ్డూ వేలం, ఇతర కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలి. ఉదయం 10' గంటల నుంచి మధ్యాహ్నం 12' గంటల మధ్యలోనే శోభాయాత్రను ప్రారంభించి, ఆలస్యం చేయకుండా అధికారులు నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి చేరుకోవాలన్నారు. విగ్రహాల తరలింపు మార్గంలో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు లేదా ఇతర అడ్డంకులు ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శోభాయాత్రలో హైకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేల వినియోగం పూర్తిగా నిషేధం. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. విగ్రహాలను తరలించే వాహనాల కండిషన్‌ను, ?వాహన ఫిట్‌నెస్ ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే వాహనాలు నడిపేందుకు అనుమతించాలన్నారు. ప్రతి విగ్రహం వెంట బాధ్యత కలిగిన నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని. రహదారులపై అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా, సాధారణ ప్రజలకు, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.
ప్రజల భద్రత కోసం, విస్తృతమైన అత్యవసర ప్రతిస్పందన చర్యలు చేపట్టబడ్డాయని. నీటిలో నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా నిర్వహించడానికి, సైబరాబాద్ పోలీస్, హైడ్రా అన్ని ప్రధాన సరస్సుల వద్ద ప్రత్యేక నైపుణ్యం గల ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ?నిమజ్జనం సమయంలో క్రేన్ కింద ఎవరూ నిలబడటం చేయకూడదు, ?చెరువులు లేదా ట్యాంక్‌లలోకి ఎవరూ నేరుగా దిగకూడదని సూచించారు. ?పూజా సామగ్రి, పూలను నీటిలోకి వెళ్లి వేయకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు.
?నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రదేశంలో ఉండే పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలని. ?25న పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా, శాంతియుత వాతావరణంలో, బాధ్యతా యుతంగా వ్యవహరించి, పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు




# SC & ST విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.




**ఖమ్మం సెప్టెంబర్ 23** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స్టేట్ హై పవర్ ాజ ఉ ాా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, అలాగే ాజ ఉ ాా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ాజ ఉ ాా వర్గాల సంక్షేమం, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, హక్కుల పరిరక్షణ, ఎదుర్కొంటున్న సమస్యలు మరియు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించడం జరిగింది.అణగారిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం, వారి సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంపై సమావేశంలో ముఖ్యంగా చర్చ జరిగింది.

# కాశీందేవిపేట గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు పిల్లలను కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క







**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**
ఇటీవలే ములుగు మండలం కాశీందేవిపేట గ్రామానికి చెందిన అహ్మద్ పాషా పొలం వద్ద పనుల్లో ఉండగా వారి ఇద్దరు ఆడ పిల్లలు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోవడంతో బాధలో ఉన్న వారి కుటుంబాన్ని నేడు అనగా తేదీ:23.09.2026 నాడు రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క గారు పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పి వారి కుటుంబానికి అండగా ఉంటామని ప్రగాఢ సానుభూతి తెలిపారుమంత్రి సీతక్క వెంట ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు యాదవ్, ఎర్రబెల్లి మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

**మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ సెప్టెంబర్ 23**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు సందడిగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మహిళలు ప్రత్యేక సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరుని దర్శించుకుని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి, శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు.భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో లక్కీడ్రా ద్వారా మొదటి బహుమతి గాను 5 కిలోల లడ్డూను, రెండవ బహుమతిగా ఎలక్ట్రిక్ స్టౌవ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ బహుమతులకు అందుకోవడానికి భక్తులు 400 రూపాయలు ఒక టోకెన్ గాను చెల్లించి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.వినాయక మండపం వద్ద భక్తులు పూజలు, మంత్రోచ్చారణలతో ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యూత్ సభ్యులు, సాయిరాం, మల్లేష్, నరేష్ గౌడ్, మల్లేశం, ప్రశాంత్ గౌడ్, హనుమంతు, విష్ణు, గురుమూర్తి, కుమార్, రాజు, దుర్గేష్ గౌడ్ , శ్రీకాంత్, అరవింద్, సంగమేష్, వీరప్ప, తదితరులు ఉన్నారు.



# నకిలీ వైద్యుడి గుట్టురట్టు

**- వైద్య అర్హత, లైసెన్స్ లేకుండానే చికిత్సలు.. భారీగా లేబుల్ లేని మందులు స్వాధీనం**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**
వైద్య అర్హత లేకుండానే తాను అర్హత కలిగిన వైద్యుడినంటూ ప్రజలకు చికిత్స అందిస్తున్న వ్యక్తిని కమిషనర్ టాస్క్‌ఫోర్స్ గోల్కొండ టీమ్, గోల్కొండ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో అదుపులోకి తీసుకున్నారు. గోల్కొండ మొహల్లా గంజ్‌లో ఎం.ఎస్.కె. ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న ఇంటి నంబర్ 9-10-17/1లో నిర్వహిస్తున్న లి"హిక్మా సెహత్ కేర్ సెంటర్"లిపై సెప్టెంబర్ 22న దాడి చేసి మహమ్మద్ అద్నాన్ (23)ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. గోల్కొండకు చెందిన మహమ్మద్ అద్నాన్ కేవలం ఇంటర్మీడియట్ సీఈసీ విద్యార్హత మాత్రమే కలిగి ఉన్నాడు. ఎలాంటి చెల్లుబాటు అయ్యే వైద్య అర్హత, లైసెన్స్ లేకుండానే తన తల్లి సబా ఖాన్ అలియాస్ ముహమ్మదీ బేగం, సోదరుడు మహమ్మద్ ఫైజాన్ సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వంశపారంపర్య హకీమ్‌లుగా తమను తాము పరిచయం చేసుకుంటూ లైంగిక సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఛాతీ నొప్పి, పదేపదే వాంతులు, తీవ్రమైన ఒళు నొప్పులు, కిడ్నీ, పక్కటెముకల నొప్పులు, మూత్ర సంబంధిత సమస్యలకు ప్రిస్క్రిప్షన్లు ఇస్తూ చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.

**సోషల్ మీడియాలో ప్రచారం**
అద్నాన్ తన వైద్య సేవల గురించి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు 'సచ్ న్యూస్'లో వచ్చిన ప్రచార కథనాల ద్వారా ప్రజలకు చేరువయ్యేవాడని పోలీసులు తెలిపారు. 2023లో టోలిచౌకికి చెందిన దీఖమీ యునాని వైద్యురాలు డాక్టర్ మునర్వా బేగంతో పరిచయం ఏర్పడిన తర్వాత, ఆమె వద్ద సహాయక వైద్య సిబ్బందిగా పనిచేశాడని పేర్కొన్నారు. క్లినిక్‌కు అప్పుడప్పుడు వచ్చేలా ఆమెకు నెలకు రూ.13 వేల చెల్లించే ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**భారీగా లేబుల్ లేని మందులు స్వాధీనం**
దాడిలో మార్కర్ పెన్‌తో పేర్లు రాసిన, సరైన లేబులింగ్ లేని పలు రకాల పొడులు, మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో తల్బీనా 20 ప్యాకెట్లు, ఎస్.ఆర్. 15 బాటిళ్లు, ఈ.జి.పి 13, ఎం.ఎఫ్ 16, కె.కె 15, డబ్ల్యూ.డి 12, బి.ఆర్ 10, హెచ్.పి/సి.సి 15, వింవి 14, ఎ.ఎస్.టి 14, జి.ఆర్ 11, పి-జెడ్ 10, హెచ్-హెచ్ 17 బాటిళ్లు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే 'హిక్మా హెల్త్ కేర్' పేరుతో ఉన్న ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, 'డాక్టర్ అద్నాన్ అఫీషియల్' ఫేస్‌బుక్ పేజీకి సంబంధించిన ఐదు ప్రిస్క్రిప్షన్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ వ్యవహారంపై గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 356/2026గా దీమీ సెక్షన్లు 318(4), 125తో పాటు 3(5) కింద కేసు నమోదు చేశారు. సబా ఖాన్ అలియాస్ ముహమ్మదీ బేగం, మహమ్మద్ ఫైజాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ పర్యవేక్షణలో ఎస్ఐ జి. విజయానంద్, గోల్కొండ పోలీసులు, సిబ్బంది సంయుక్తంగా ఈ చర్య చేపట్టారు.

గురువారం,
సెప్టెంబర్ 24, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# కృష్ణారెడ్డి మృతి బాధాకరం

**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెప్టెంబర్ 23**
ఫరుకు నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి మృతి తీవ్రంగా బాధాకరమని గ్రామ సర్పంచ్ లతా కిరణ్ అన్నారు. కృష్ణారెడ్డి గత కొంతకాలంగా షాద్‌నగర్‌లోని ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటూ చటాన్‌పల్లిలోని పాతూరి వెంకట్రావుకు చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారని తెలిపారు.రోజువారీ పనిలో భాగంగా బుధవారం కూడా



పౌల్ట్రీ ఫామ్‌కు వెళ్లిన కృష్ణారెడ్డిని కోళ్లకు వ్యాక్సిన్ వేసే పనికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం,పౌల్ట్రీ ఫామ్‌లో బోరు పనిచేయకపోవడంతో సూపర్‌వైజర్‌తో కలిసి కృష్ణారెడ్డి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడ అడ్డుగా వచ్చిన మేకలను పక్కకు పంపించే క్రమంలో విద్యుత్ ప్రమాదానికి గురై కృష్ణారెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి సూపర్‌వైజర్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.కృష్ణారెడ్డి కుమారుడు సూరవర్ధన్‌రెడ్డి, ఆయన భార్య, కమ్మదనం సర్పంచ్ లతా కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కృష్ణారెడ్డి కుమారుడు సూరవర్ధన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.కృష్ణారెడ్డి మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు తీరని లోటని సర్పంచ్ లతా కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# కొండ భీమనపల్లి చెరువులో వినాయకుల నిమజ్జనం

- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కరోలిన్,
- డిఎస్పీ శ్రీనివాసరావు. మునిసిపల్ కమిషనర్ రామదుర్గ రెడ్డి .
- కొండ భీమన్నపల్లి చెరువులో ఘనంగా గణనాథుల నిమజ్జనం

**దేవరకొండ 23సెప్టెంబర్**
దేవరకొండ మండలంలోని కొండ భీమనపల్లి గ్రామ చెరువులో వినాయక నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. గత తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులు బుధవారం గంగమ్మ ఒడికి చేరారు.?పట్టణం మరియు గ్రామాల్లోని వివిధ మండపాలలో కొలువుదీరిన వినాయకులను డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, కోలాటాలు మరియు యువకుల నృత్యాలతో భక్తులు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ గణపతి నామస్మరణ చేస్తూ ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొండ భీమనపల్లి







చెరువు వద్ద భక్తిశ్రద్ధలతో "మళ్లీ రావయ్యా గణపయ్యా" అంటూ భక్తులు కన్నీటి వీడ్కోలులిస్తూ గణనాథులను నిమజ్జనం చేశారు.అధికారుల పరిశీలన – పటిష్ట బందోబస్తు:నిమజ్జన ఏర్పాట్లను సబ్ కలెక్టర్ కరోలిన్, డిఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ రామదుర్గ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మునిసిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, మునిసిపల్ సిబ్బంది పారిశుద్ధ్య ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించారు.?గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జ్‌గా ఎంపీ డీకే అరుణ

**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెప్టెంబర్ 23** తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జ్‌గా ఎంపీ డీకే అరుణ నియమితులైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.తమిళనాడులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డీకే అరుణ నాయకత్వం,కృషి దోహదపడుతుందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.



## గణేష్ నిమజ్జనం సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బందోబస్తు రోల్‌కాల్ నిర్వహించబడింది:సి ఐ జలెందర్ రెడ్డి

**మేడిపల్లి, సెప్టెంబర్, 23,**
గణేశ్ నిమజ్జనం సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్ రోల్ కాల్ నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా సీ ఐ జలెందర్ రెడ్డి పోలీసు సిబ్బందికి వారి వారి డ్యూటీ పాయింట్లు, విధులు, గణేష్ ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహం నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి అవసరమైన సూచనలు ఇచ్చారు. నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా మరియు సజావుగా జరిగేలా



సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే డీజేలు/అధిక శబ్దం నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భక్తుల భద్రత మరియు సిబ్బంది మధ్య సమన్వయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యాన్ని పల్లె ప్రజలకు చేరువ చేయాలి.

- మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి.
- ఏటూరునాగారం ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు.
- జాతీయ ఆయుర్వేద దినోత్సవ శిబిరాన్ని ప్రారంభించిన
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.















**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**
ఆయుర్వేద వైద్య సేవలను మారుమూల గ్రామాల ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆయుష్ విభాగం అధికారులకు సూచించారు.11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఆయుర్వేదం పురాతన వైద్య విధానమని, గ్రామీణ ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా శిబిరాలు నిర్వహించాలని అన్నారు. వర్షాకాలంతోపాటు రాబోయే కాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న మారుమూల గ్రామాలకు వైద్య బృందాలు వెళ్లాలని మంత్రి తెలిపారు. శిబిరాల తేదీలను ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి, ఎక్కువ మంది ప్రజలు సేవలు పొందేలా చూడాలన్నారు. ఈ నెల 27న చిన్నబోయినపల్లిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య బృందం పాల్గొనాలని కోరారు.ఏటూరునాగారంలోని ఆయుర్వేద ఆసుపత్రికి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రికి పక్కా భవనాలు, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, వైద్య బృందం, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- ముని్సపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో పర్యాటక, వైద్య, రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- లక్ష్మీనగర్‌లో 5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును ప్రారంభించిన
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క











**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23( పీపుల్స్ న్యూస్)**
ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో 5.95 కోట్ల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. బృందావనం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో నివాసాలు విస్తరించడంతో స్థానికుల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గతంలో మంజూరైన రహదారి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు.
ములుగు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మంజూరైన అభివృద్ధి పనులతోపాటు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ములుగు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ట్యాంకులు, తోపుకుంట మినీ ట్యాంక్‌బండ్, అంతర్గత రహదారులు, స్మశానవాటిక అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం సమర్పించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు.ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి వివిధ శాఖల సమన్వయంతో నిరంతరం పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మంజూరైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతోపాటు కొత్తగా అవసరమైన పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ములుగులో 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని, జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.
ములుగు పరిసర ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాలను విస్తరించేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిసరాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
మల్లూరు క్షేత్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను నిర్మాణ నిపుణులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర అంచనాలు రూపొందించనున్నట్లు చెప్పారు. అవసరమైన మిగతా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.మేడారం సమ్మక్క--సారలమ్మ క్షేత్ర పరిసరాల్లో భక్తులు, స్థానికులకు మెరుగైన సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రి, రహదారులు--భవనాల శాఖ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతర ప్రాధాన్యం, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, నీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీటి వసతులు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాం నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం గోదాముల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరితనం.. లాభసాటి వ్యాపారం

ఒంటరితనం వ్యాపారంలో అత్యంత లాభదాయకమైన, సున్నితమైన భాగంగా రహస్య డేటింగ్ యాప్‌లు అవతరించా యి. గ్లీడెన్, ఫ్యూర్, ఆష్లే మ్యాడిసన్ వంటి ప్రైవేట్ వేదికలు వినియోగదారుల అనామకతను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. ఉదాహరణకు, ఎక్స్‌ట్రా- మారిటల్ డేటింగ్ యాప్ 'గ్లీడెన్' ఒక్క భారత్‌లోనే ఏకంగా 40 లక్షల (4 మిలియన్లు) వినియోగదారుల మైలురాయిని దాటింది. ఇందులో హైదరాబాద్ (17%), బెంగళూరు (18%), ఢిల్లీ, ముంబై నగరాలు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, మహిళల నమోదులో 148 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. సాధారణ డేటింగ్ యాప్‌లలో వినియోగదారుడి సగటు వార్షిక రాబడి 15 నుంచి 20 డాలర్లు ఉంటే, ఈ రహస్య యాప్‌లలో ఇది ఏకంగా 50 డాలర్లు (రూ. 4,200 పైగా) దాటుతోంది. పే-పర్-మెసేజ్, చాటింగ్ క్రెడిట్లు, ప్రైవేట్ ఫిల్టర్ల పేరిట ఈ కంపెనీలు శరవేగంగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థల్లో అశాంతి, బ్లాక్ మెయి లింగ్ మోసాలకు ఇవి దారితీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం మనుషులను ప్రపంచానికి అనుసంధానించామని చెబుతున్న ప్పటికీ, క్షేత్రస్థాయిలో అది తీవ్రమైన ఏకాంతాన్ని, సామాజిక దూరాన్ని వదిలిపెట్టింది.

మానవ జీవితంలో ఏకాంతం అనేది కేవలం ఒక వ్యక్తిగత మానసిక వేదన మాత్రమే కాదు, అది ఆధునిక డిజిటల్ యుగంలో వందల బిలియన్ డాలర్ల టర్నోవర్‌తో వర్ధిల్లుతున్న అత్యంత లాభదాయకమైన 'లోన్లీనెస్ ఎకానమీ' (ఒంటరితనం ఆధారిత ఆర్థిక వ్యవస్థ) గా అవతరించింది. క్రమబద్ధమైన శారీరక క్షీణత, హృద్రోగాలు, తీవ్రమైన కుంగుబాటు (డిప్రెషన్), సోషల్ యాంగ్జయిటీకి దారితీస్తున్న ఈ ఏకాంతాన్ని ప్రపంచ ఆరోగ్య నిపుణులు తీవ్రమైన ముప్పుగా హెచ్చరిస్తున్నారు.

రోజుకు 15 సిగరెట్లు తాగడం వల్ల శరీరానికి కలిగేంత నష్టం సుదీర్ఘకాలపు ఒంటరితనం వల్ల జరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ విశ్లేషిస్తుండగా, మనుషుల్లోని ఈ భావోద్వేగ రహిత ఖాళీ తనాన్నే డిజిటల్ వేదికలు, సామాజిక మాధ్యమాలు తమ ప్రధాన పెట్టుబడిగా మార్చుకుని ప్రపంచవ్యాప్తంగా వేల కోట్లు కొల్లగొడుతున్నాయి. మనుషుల నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని నిరంతరం సొమ్ము చేసుకోవడంలో బిగ్ టెక్ సంస్థలు ముందు వరసలో ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాలు తమ అల్గారిథమ్‌ల ద్వారా వినియోగదారులను గంటల తరబడి స్క్రీన్‌లపై ఉంచుతూ 'అటెన్షన్ ఎకానమీ'ని నడుపుతున్నాయి. మెటా సంస్థ ఏడాదికి సుమారు 130 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 10.8 లక్షల కోట్లు) పైగా ప్రకటనల రాబడిని పొందుతుండగా, మానవ అనుబంధాల కోరికను ఆసరాగా చేసుకుని




'మ్యాచ్ గ్రూప్' ఏడాదికి 3.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 28 వేల కోట్లు), 'బంబుల్' 1 బిలియన్ డాలర్ల వార్షిక రాబడి సాధిస్తున్నాయి. ఇందుకు తోడు 'క్యారెక్టర్ ఎఐ' , 'రెప్లికా' వంటి కంపెనీలు చాట్‌బాట్‌లను అందుబాటులోకి తెచ్చి మిలియన్ల మంది ఒంటరి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పారాసోషల్ సంబంధాల ద్వారా 'ఓన్లీఫ్యాన్స్' ఏటా 6.6 బిలియన్ డాలర్ల లావాదేవీలను నమోదు చేస్తూ, 1.3 బిలియన్ డాలర్ల (రూ. 10,800 కోట్లు) నికర ఆదాయాన్ని ఆర్జిస్తోంది. స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ల పరిమితులను దాటి, ఆఫ్‌లైన్‌లో నేరుగా కలవాలనే తపనతో భారత్‌లోని హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి ఐటి నగరాల్లో 'లెట్స్ సోషలైజ్' భావన కొత్త వ్యాపార రంగానికి ఊపిరి పోసింది.

ద్వితీయ శ్రేణి నగరాల నుంచి వచ్చి మెట్రోలలో పనిచేస్తున్న ఐటి ఉద్యోగులు, యువతను అపరిచితులతో కలిపే ఆఫ్‌లైన్ మీటప్ యాప్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వారాంతాల్లో అపరిచితులను ఒకే టేబుల్‌పైకి తెచ్చి డిన్నర్ మీటప్‌లు నిర్వహించే 'టైమ్‌లెఫ్ట్', స్పోర్ట్ డిస్కవరీ వేదిక 'ప్లేయో', 'మీటప్', 'బంబుల్ బిఎఫ్‌ఎఫ్' వంటి యాప్‌లు భారీగా వృద్ధి చెందుతున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు సబ్‌స్క్రిప్షన్ల ద్వారానే కాకుండా, స్థానిక రెస్టారెంట్లు, కేఫ్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఒక్కో వ్యక్తి నుంచి ఈవెంట్‌కు రూ. 500 నుంచి రూ. 2,000 వరకు వసూలు చేస్తూ పటిష్టమైన రాబడి నమూనాను అమలు చేస్తున్నాయి. ఈ ఒంటరితనం వ్యాపారంలో అత్యంత లాభదాయకమైన, సున్నితమైన భాగంగా రహస్య డేటింగ్ యాప్‌లు అవతరించాయి. గ్లీడెన్, ఫ్యూర్, ఆష్లే మ్యాడిసన్ వంటి ప్రైవేట్ వేదికలు వినియోగదారుల అనామకతను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. ఉదాహరణకు, ఎక్స్‌ట్రా- మారిటల్ డేటింగ్ యాప్ 'గ్లీడెన్' ఒక్క భారత్‌లోనే ఏకంగా 40 లక్షల (4 మిలియన్లు) వినియోగదారుల మైలురాయిని దాటింది. ఇందులో హైదరాబాద్ (17%), బెంగళూరు (18%), ఢిల్లీ, ముంబై నగరాలు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, మహిళల నమోదులో 148 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. సాధారణ డేటింగ్ యాప్‌లలో వినియోగదారుడి సగటు వార్షిక రాబడి 15 నుంచి 20 డాలర్లు ఉంటే, ఈ రహస్య యాప్‌లలో ఇది ఏకంగా 50 డాలర్లు (రూ. 4,200 పైగా) దాటుతోంది.

పే-పర్-మెసేజ్, చాటింగ్ క్రెడిట్లు, ప్రైవేట్ ఫిల్టర్ల పేరిట ఈ కంపెనీలు శరవేగంగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థల్లో అశాంతి, బ్లాక్ మెయిలింగ్ మోసాలకు ఇవి దారితీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం మనుషులను ప్రపంచానికి అనుసంధానించామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది తీవ్రమైన ఏకాంతాన్ని, సామాజిక దూరాన్ని వదిలిపెట్టింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు మానవ ఉద్వేగ బలహీనతను కోట్లాది డాలర్ల వ్యాపార నమూనాగా మార్చుకుని లాభపడుతుండగా, సామాజిక అనుబంధాల లోపం తో మనుషులు మానసిక, ఆర్థిక నష్టాలను మూటగట్టుకుంటున్నారు. సమాజంలో ఆత్మీయమైన మానవ బంధాలు పునరుదరణకానంత వరకు ఈ 'ఒంటరితనం ఆధారిత ఆర్థిక వ్యవస్థ' మరిన్ని కొత్త రూపాల్లో విస్తరిస్తూనే ఉంటుంది.

## పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రదేశాల పరిశుభ్రతకు ప్రాధాన్యత.

---జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్, సెప్టెంబర్ 23 )**పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించింది. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... మెదక్ జిల్లాకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపద ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా సందర్శకులకు మంచి అనుభూతిని కల్పించడంతో పాటు జిల్లాకు పర్యాటకంగా మరింత గుర్తింపు లభించేలా చేయవచ్చన్నారు. జిల్లాలోని మెదక్ ఖిల్లా, చర్చి, ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయం, పోచారం వన్యప్రాణి అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్, చారిత్రక కోటలు, చెరువులు, జలపాతాలు, దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈ డి యం సందీప్, మహేందర్ , ఆర్ ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## నిశ్శబ్దంగా వ్యాపిస్తోన్న హెచ్1ఎన్1 వైరస్ - జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్స్



**హైదరాబాద్:** రాష్ట్రంలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ చాప కింద నీరులా వ్యాపిస్తోంది. హైదరాబాద్? మహానగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి కేసుల తాకిడి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీని ద్వారా చాలా మంది ఇబ్బందికి గురికాకపోయినప్పటికీ కొందరిలో తీవ్ర న్యుమోనియాకు దారితీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్?లో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఇటీవల ఈ వైరస్ కారణంగా ఒక రోగి మరణించినట్లు సమాచారం. అయితే వైద్యారోగ్య శాఖ మాత్రం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. దిల్లీ, కర్ణాటక వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో హెచ్?1ఎన్1 వైరస్ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇన్?ఫ్లుయెంజా సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. అందుకే తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యమని, మాస్క్ ధరించడం ఉత్తమమని డాక్టర్లు చెబుతున్నారు.

ఎవరికి ఎక్కువ ప్రమాదం?

రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై వైరస్? ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్నవారు ఫ్లూ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అయితే ఫ్లూ సోకిన ప్రతి ఒక్కరికీ యాంటీవైరల్ మందులు అవసరం లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నవారు మాత్రమే యాంటీవైరల్ మందులను వాడాలని చెబుతున్నారు. అదీ కూడా వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన 48 గంటల్లోపు ఈ మందులను వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయంటున్నారు.

ఎప్పుడు ఆసుపత్రిలో చేరాలి?

శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఆయాసం
ఛాతి నొప్పి, ఒత్తిడి, లేదా నీరసం
రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం
తల తిరగడం, గందరగోళంగా అనిపించడం, వాంతులు చేసుకోవడం
జ్వరం తగ్గుతూ మళ్లీ తిరిగి తీవ్రంగా రావడం
వైరస్ సోకితే కనిపించే ప్రధాన లక్షణాలు
చలితో కూడిన అధిక జ్వరం
దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం లేదా దిబ్బడతీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి
నీరసం, అలసట, కొన్ని సందర్భాల్లో వాంతులు, విరేచనాలు

"(హెచ్?1ఎన్1) ఇన్ఫ్లుయెంజా ఏ అనే వైరస్ సంక్రమణ గురించి భయపడాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ పలు జాగ్రత్తలు అవసరం. ఈ వైరస్ సోకిన వారిలో సుమారు 95 శాతం మందిలో తేలికపాటి లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి. వీరు ఇంట్లో విశ్రాంతి తీసుకోవడంతో కోలుకోవచ్చు. వైద్యులు సూచించినంత కాలం యాంటీవైరల్ మందులను కచ్చితంగా తీసుఅనే వైరస్ సంక్రమణ గురించి భయపడాల్సిన కోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా సీజనల్ ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితం. ఇంట్లోనే ఉంటూ కాచి వడకట్టిన నీరు, పండ్ల రసాలు, వేడి సూప్‌లు, ఓఆర్ఎస్‌లను తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు. లక్షణాలు తీవ్రంగా ఉంటే ఆసుపత్రిలో చేరాలి" డా.ఎంవీ రావు, యశోద హాస్పిటల్స్

# తొమ్మిది రోజుల పండగకు.. తొమ్మిది గంటల సమయం కూడా లేదా?

**- నిమజ్జనం చేసిన గంటల్లోనే విగ్రహాల తొలగింపు..**

**మాజీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆవేదన**





**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసిన కొన్ని గంటల్లోనే చెరువుల నుంచి బయటకు తీసి డీసీఎం వాహనాల్లో తరలించడంపై మాజీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆవేదన వ్యక్తం చేశారు. పండగ పూర్తయిన తర్వాత విగ్రహాలను తొలగించవచ్చని, అయితే నిమజ్జనం జరిగిన వెంటనే విగ్రహాలను బయటకు తీయడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆమె పేర్కొన్నారు. చందాలు వేసుకుని, ఎంతో శ్రమించి, తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించిన భక్తులకు నిమజ్జనం అనంతరం చోటుచేసుకుంటున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయని అన్నారు. పెద్ద చెరువుల్లో విగ్రహాలను వేర్వేరు ప్రాంతాల్లో నిమజ్జనం చేసి, పండగ పూర్తయిన తర్వాత చెరువులను శుభ్రం చేయవచ్చని సూచించారు. "తొమ్మిది రోజులు పూజించిన వినాయకుడిని కనీసం తొమ్మిది గంటలు కూడా నీళ్లలో ఉండనివ్వరా?" అని ఆకుల శ్రీవాణి ప్రశ్నించారు. ప్రభుత్వం కమిట్‌మెంట్, చిత్తశుద్ధితో వ్యవహరిస్తే చెరువులను శుభ్రం చేయడం పెద్ద సమస్య కాదన్నారు. పండగ పూర్తయ్యే వరకు విగ్రహాలను చెరువుల్లోనే ఉంచి, అనంతరం గౌరవప్రదంగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హిందువుల పండగల విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే భావన భక్తుల్లో కలగడం బాధాకరమని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నించేవారు లేరని భావించి భక్తుల మనోభావాలను పట్టించుకోకుండా వ్యవహరించకూ డదన్నారు. నిమజ్జనం చేసిన కొన్ని గంటల్లోనే విగ్రహాలను చెరువుల నుంచి బయటకు తీసి డీసీఎం వాహనాల్లో తరలిస్తున్న తీరుపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆకుల శ్రీవాణి డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, పండగ నిర్వహణతో పాటు నిమజ్జనం అనంతర చర్యల్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# భక్తిమార్గంలో యువత ఆదర్శంగా నిలవాలి

●కైలాస్‌హిల్స్‌లో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

●భారీగా పాల్గొన్న భక్తులు.. వెయ్యి మందికి అన్నప్రసాదం












**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)** యువత భక్తిమార్గంలో పయనిస్తూ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు కృషి చేయాలని కైలాస్‌హిల్స్ కాలనీ పెద్దలు పిలుపునిచ్చారు. కైలాస్‌హిల్స్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు వాసాల సాయితేజ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు మండప నిర్వాహకులు తెలిపారు. కాలనీవాసులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.కైలాస్‌హిల్స్‌లో వరుసగా తొమ్మిదో ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న సాయితేజ, ఆయన బృందాన్ని కాలనీ పెద్దలు అభినందించారు. చిన్న వయసులోనే భక్తి, సేవా కార్యక్రమాలను చేపడుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. యువతను సన్మార్గంలో నడిపించడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.కైలాస్‌హిల్స్ కాలనీ మాజీ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ యువతలో భక్తి, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తిని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ యువత చురుగ్గా పాల్గొనాలని సూచించారు.సాయి తేజ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న కాలనీ పెద్దలు, మిత్రులు, భక్తులు, సీనియర్ జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతోనే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, వాసాల కార్తీక్ తేజ్, ప్రవీణ్ రెడ్డి, రాకేష్, నవీన్, చిన్న రోహిత్, సాయి ప్రసాద్, సాయి, చోటు, మణి, పండు తదితరులతో పాటు కాలనీవాసులు, మహిళలు, యువత,జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్న ప్రసాదం

**అన్న ప్రసాద వితరణలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 23):**
ఎల్లారెడ్డిపట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గజేంద్ర సేన గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మత్తామాల భాగ్యవతి, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులను గణేష్ మండలి సభ్యులు శాలువాలతో సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇలేగాంలో నేడు గణేష్ నిమజ్జనం, సార్వజనిక్ మహా అన్నదానం

**గ్రామ పంచాయతీ పాలకవర్గం, విడిసి సభ్యుల వెల్లడి**

**ముధోల్(భైంసా రూరల్), సెప్టెంబర్ 23:**
భైంసా మండలం ఇలేగాం గ్రామంలో కొలువైన వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలు, సార్వజనిక్ మహా అన్నదాన కార్యక్రమాన్ని గురువారం (నేడు) వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ విడిసి (గ్రామ అభివృద్ధి కమిటీ) సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.గత 10 రోజులుగా భక్తుల పూజలందుకున్న లంబోదరుడికి నేటి ఉదయం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి భక్తులందరికీ భారీ ఎత్తున సార్వజనిక్ మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.సాయంత్రం వేళ మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాటాల నడుమ గణనాథుడి శోభాయాత్ర (ఊరేగింపు) ప్రారంభం కానుంది. గ్రామంలోని ముఖ్య వీధుల గుండా సాగే ఈ నిమజ్జన మహోత్సవంలో సర్పంచ్ సీరం రాజమణి శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, విడిసి చైర్మన్ కే. రత్నాకర్, క్యాషియర్ కే. కృష్ణమూర్తి, విడిసి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# త్రివర్ణ గణేశుని శోభాయాత్ర వైభవం

**- గుస్సాడి నృత్యాలతో మార్మోగిన కాగజ్‌నగర్**

**- ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**





**కొమరం భీమ్, సెప్టెంబర్ 23):** కాగజ్‌నగర్ పట్టణంలో త్రివర్ణ గణేశుని శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు, స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
పట్టణంలోని మార్కెట్ ఏరియా, రాజీవ్‌గాంధీ చౌరస్తా మీదుగా శోభాయాత్ర కోలాహలంగా సాగింది. దారిపొడవునా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ గుస్సాడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల గణపతి నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి. ప్రజలు, కార్యకర్తల భాగస్వామ్యంతో శోభాయాత్ర ఘనంగా ముగిసింది.

# లింగం చెరువు వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

**అధికారులకు పలు సూచనలు చేసిన డీసీపీ కోటిరెడ్డి**






**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23, (పీపుల్స్ న్యూస్)**
లింగం చెరువు వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్ బుధవారం పరిశీలించారు. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగం చెరువు వద్దకు చేరుకున్న ఆయన చెరువు వద్ద భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు.బందోబస్తు నిర్వహణ, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని డీసీపీ సూచించారు.ఈ సందర్భంగా అవసరమైన భద్రతాచర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. డీసీపీ పర్యటన సందర్భంగా సూరారం పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్కాం చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

●భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా

చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు



**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో మల్కాం చెరువు నిమజ్జన ప్రదేశాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ రెడ్డి ఐపీఎస్ మంగళవారం సాయంత్రం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్ల పనితీరును స్వయంగా పరిశీలించిన సీపీ.. విగ్రహాల నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా బేబీ పాండ్‌లో నీటి మట్టం, నిమజ్జన ప్రాంతంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు భద్రతా చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ ఐపీఎస్, మహిళా భద్రతా విభాగం డీసీపీ సృజన, ఏసీపీ ట్రాఫిక్–1, ట్రాఫిక్ ఏసీపీ, స్థానిక లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి సిటీ పోలీస్ సర్వసన్నద్ధం

- శోభాయాత్రపై 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లతో నిఘా
- బందోబస్తులో 20 వేల మంది పోలీసు సిబ్బంది.. 8,142 మంది అదనపు సిబ్బంది
- ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 25న జరిగే మహానిమజ్జన శోభాయాత్రకు హైదరాబాద్ సిటీ పోలీస్ సర్వసన్నద్ధమైంది. బాలాపూర్ గణేష్ నుంచి ప్రారంభమయ్యే తుది శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ, పొరుగు జిల్లాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులను దృష్టిలో ఉంచుకుని బందోబస్తు వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఖైరతాబాద్ బడా గణేష్‌ను ఇప్పటివరకు 25 లక్షల మంది, బాలాపూర్ గణేష్‌ను 15 లక్షల మంది దర్శించుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిమజ్జనం రోజున ఈ ప్రాంతాల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టారు.

**మూడు నెలల ముందే కసరత్తు**

గణేష్ ఉత్సవాల నిర్వహణకు మూడు నెలల ముందుగానే హైదరాబాద్ సిటీ పోలీస్ కసరత్తు ప్రారంభించింది. జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్, జలమండలి, రవాణా, అగ్నిమాపక, వైద్యారోగ్య, హైడ్రా, హెచ్ఎండీఏ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీల ప్రతినిధులతోనూ సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలను చేపట్టారు.మండపాల ఆన్‌లైన్ అనుమతుల విధానంలో 15,426 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 14,929 మండపాలకు అనుమతులు మంజూరు చేశారు. అనుమతి పొందిన మండపాలకు జియో ట్యాగింగ్ చేశారు. ప్రమాద నివారణ, విద్యుత్ తీగల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేశారు.ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు చెందిన 32,878 విగ్రహాల నిమజ్జనం పూర్తికాగా, వాటిలో హైదరాబాద్ నగరానికి చెందిన 6,108 విగ్రహాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గత 24 గంటల్లో నగర పరిధిలో 2,161 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు తెలిపారు.

**10 వేల కెమెరాలతో నిఘా**

మహానిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో ఏర్పాటు చేసిన 10 వేల సీసీ కెమెరాలను బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ కంట్రోల్ రూమ్‌కు




అనుసంధానం చేశారు. కీలక ప్రాంతాల్లో నిఘా కోసం 24 అత్యాధునిక డ్రోన్లను వినియోగిస్తున్నారు. ప్రధాన మార్గాల్లో సుమారు 100 హైరైజ్ కెమెరాలను ఏర్పాటు చేసి విగ్రహాల రాకను పర్యవేక్షిస్తున్నారు.ఎత్తైన భవనాలపై బైనాక్యులర్లు, వైర్‌లెస్ సెట్లతో పోలీసు సిబ్బందిని మోహరించారు. బంజారాహిల్స్ ప్రధాన జాయింట్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్, మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.ప్రధాన జలాశయాల వద్ద గజ ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లు సిద్ధంగా ఉంచారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లు, రాత్రివేళ నిఘా కోసం వాచ్‌టవర్లు, వైద్య సేవలకు అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. వాహనాలు మొరాయించిన సందర్భాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రధాన కూడళ్ల వద్ద మెకానిక్‌లు, అదనపు డ్రైవర్లను సిద్ధంగా ఉంచారు.

**20 వేల మందితో బందోబస్తు**

నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ తదితర విభాగాల నుంచి దాదాపు 20 వేల మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. ఇతర జిల్లాల నుంచి 8,142 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 42 ప్లాటూన్లను రప్పించి ఏడు జోన్లకు కేటాయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కోసం నాలుగు ఆర్ఏఎఫ్ కంపెనీలు, రెండు సీఆర్‌పీఎఫ్ కంపెనీలను మోహరించారు. 53 బీడీ టీమ్‌లు కూడా విధుల్లో ఉంటాయి. నగర ప్రవేశ మార్గాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు.

**షీ టీమ్స్‌తో ప్రత్యేక నిఘా**

మహిళలు, యువతుల భద్రతకు మూడు షిఫ్టుల్లో 26 షీ టీమ్స్ బృందాలను రంగంలోకి దించారు. సెప్టెంబర్ 14 నుంచి ఇప్పటివరకు ఖైరతాబాద్, బాలాపూర్ తదితర రద్దీ ప్రాంతాల్లో అసభ్యంగా ప్రవర్తించిన 1,172 మందిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో 1,121 మంది మేజర్లు, 51 మంది మైనర్లు ఉన్నట్లు వెల్లడించారు.నేర నియంత్రణలో భాగంగా సీసీఎస్ పరిధిలో 139 మంది సిబ్బందిని ఐదు సెక్టార్లుగా విభజించి, 25 ప్రత్యేక బృందాలతో మఫ్టీలో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఆపదలో ఉన్న మహిళలు డయల్ 112 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

**డీజేలు, అధిక శబ్దంపై నిషేధం**

శబ్ద కాలుష్య నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, సౌండ్ మిక్సర్లు, అధిక శబ్ద తీవ్రత కలిగించే పరికరాలు, బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పరికరాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సంయమనం పాటించాలి: సీపీ సజ్జనార్**

హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని రకాల పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నగర ప్రజలు సంయమనం పాటిస్తూ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, పుకార్లను వ్యాప్తి చేసే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయించిన జలాశయాల్లోనే నిమజ్జనాలు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ గంగా-జమునా తెహజీబ్, సోదరభావాన్ని కాపాడుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే అడ్వైజరీలను ప్రజలు ఎప్పటికప్పుడు పాటించాలని, అందుకు అనుగుణంగా ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలకు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపం నుంచి నిమజ్జన ప్రదేశం వరకు ముందుగానే రూట్ సర్వే నిర్వహించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ప్రసా దాల పంపిణీలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు.

# గణేష్ నిమజ్జనానికి భారీ ట్రాఫిక్ ఆంక్షలు

**- 25న ఉదయం 6 నుంచి 26న ఉదయం 10 వరకు అమలు.. కీలక మార్గాల్లో వాహనాల మళ్లింపు**



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)** హైదరాబాద్ నగరంలో సెప్టెంబర్ 25న జరగనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన ఊరేగింపును పురస్కరించుకుని నగర పోలీసులు విస్తృత స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల మళ్లింపులను ప్రకటించారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించడం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (కార్యనిర్వాహక) వి.సి. సజ్జనార్, ఐపీఎస్ హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం సెక్షన్ 21(1)(బి) ప్రకారం ఈ ఆంక్షలు విధించారు.సెప్టెంబర్ 25 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 10 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. పరిస్థితులను బట్టి ఈ గడువును పొడిగించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.



**బాలాపూర్ నుంచి నెక్లేస్ రోడ్డు వరకు ప్రధాన ఊరేగింపు**

ప్రధాన గణేష్ నిమజ్జన ఊరేగింపు బాలాపూర్ నుంచి ప్రారంభమై చంద్రాయణగుట్ట వంతెన, ఫలక్‌నుమా, ఆలియాబాద్, చార్మినార్, మదీనా, అఫ్జల్‌గంజ్, మహారాజా గంజ్ మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ మీదుగా ఎన్టీఆర్ మార్గం, పి.వి.ఎన్.ఆర్ మార్గం వైపు కొనసాగనుంది.సికింద్రాబాద్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, తార్నాక, టోలిచౌకి, ఎర్రగడ్డ, ఆసిఫ్‌నగర్, రాంనాథ్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాల ఊరేగింపులు అనుబంధ మార్గాల ద్వారా ప్రధాన ఊరేగింపులో కలుస్తాయి. ఊరేగింపు జరిగే ప్రధాన మార్గాల్లో నిమజ్జన వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. సాధారణ వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించనున్నారు.

**ప్రధాన రహదారుల్లో రాకపోకలు నిలిపివేత**

ఊరేగింపు మార్గాలు, వాటికి అనుసంధానమైన కీలక రహదారుల్లో సాధారణ వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. తూర్పు--పడమర, పడమర--తూర్పు దిశల్లో నగరాన్ని దాటే వాహనాలకు బషీర్‌బాగ్ కూడలి వద్ద మాత్రమే అవకాశం కల్పించారు. వాహనదారులు లోపలి రింగ్ రోడ్డు, మసాబ్‌ట్యాంక్--పంజాగుట్ట--బేగంపేట--సికింద్రాబాద్ మార్గం లేదా వెలుపలి రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. చంద్రాయణగుట్ట, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని పలు కీలక కూడళ్ల వద్ద మళ్లింపులు అమల్లో ఉంటాయి.

**భారీ వాహనాలకు నగరంలోకి నో ఎంట్రీ**

భారీ వాణిజ్య వాహనాలు, సరుకుల లారీలను నగరంలోకి అనుమతించరు. నగర శివార్లలోనే వాటిని నిలిపివేసి ఓఆర్ఆర్ వైపు మళ్లించనున్నారు.

ప్రైవేటు రవాణా బస్సులకు సెప్టెంబర్ 22 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోకి ప్రవేశం ఉండదు. అవి నగర వెలుపలి మార్గాల నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.నిమజ్జన ఊరేగింపు తీవ్రతను బట్టి ఆర్టీసీ నగర బస్సులను మసాబ్‌ట్యాంక్, వి.వి. విగ్రహం, సికింద్రాబాద్ క్లాక్‌టవర్, తార్నాక, దిల్‌సుఖ్‌నగర్, ఆరాంఘర్ తదితర పరిమిత ప్రాంతాల వరకు మాత్రమే అనుమతించనున్నారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలి.

**నిమజ్జనం తర్వాత ప్రత్యేక నిష్క్రమణ మార్గాలు**

ఎన్టీఆర్ మార్గం, ఎగువ చెరువు గట్టు, పి.వి.ఎన్.ఆర్ మార్గాల్లో నిమజ్జనం పూర్తయిన ఖాళీ లారీలు, ట్రక్కులు ప్రత్యేకంగా కేటాయించిన నిష్క్రమణ మార్గాల ద్వారానే తిరిగి వెళ్లాలి.

నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులు తమ వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి, అక్కడి నుంచి కాలినడకన నిమజ్జన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచించారు. ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం, కట్టమైసమ్మ ఆలయం--దిగువ చెరువు గట్టు రోడ్డు, ప్రభుత్వ ఉద్యానవనం, ఖైరతాబాద్ రైల్వే స్టేషన్, ఖిల్వత్ మైదానం తదితర ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేశారు.

**విమానాశ్రయం, రైల్వే ప్రయాణికులకు సూచనలు**

శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులు నెక్‌లేస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గం, చెరువు గట్టు రహదారులను నివారించి పి.వి.ఎన్.ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఓఆర్ఆర్‌ను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు బేగంపేట, ప్యారడైజ్ వంతెన, సంగీత్ కూడలి మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు.నిమజ్జనం కోసం సమీపంలోని చెరువులు, ప్రత్యేక తటాకాలు, ప్రత్యామ్నాయ రవాణా మార్గాల వివరాలను పోలీసులు అందుబాటులో ఉంచారు. ప్రయాణానికి ముందు ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

ప్రయాణ సహాయం కోసం:040-27852482 । 8712660600 । 9010203626

# నిర్మల్ ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్‌గా డీఆర్వో రాథోడ్ రమేశ్

**- కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతల స్వీకరణ**

**- పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు**



**ముధోల్ (నిర్మల్ కలెక్టరేట్),సెప్టెంబరు 23**

నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) రాథోడ్ రమేష్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన విధుల్లో చేరారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులు,రెవెన్యూ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలనలోని పలు కీలక అంశాలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల పురోగతిపై అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీపీఓ విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్,డీఎం సుధాకర్, ఏడీ ప్రవీణ్, పలువురు రెవెన్యూ అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన పట్టాదారులు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలి:మండల వ్యవసాయ అధికారి సారిక



**ముధోల్(కుబీర్),సెప్టెంబర్ 23** కుబీర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతనంగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులందరూ ప్రభుత్వం నుంచి అందే సేవలు, రాయితీలను పొందేందుకు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు నమోదు) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ) సారిక ఒక ప్రకటనలో ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 01-01-2026 నుండి 13-08-2026 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు అందుకున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన రైతులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే తమ పరిధిలోని గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) సంప్రదించి,తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ రైతు నమోదు ప్రక్రియ పూర్తయిన వారికి మాత్రమే ప్రభుత్వ వ్యవసాయ సేవలు, విత్తనాలు,ఎరువులపై లభించే సబ్సిడీలు మరియు వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు.రిజిస్ట్రేషన్ చేసుకోని పక్షంలో ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని,కాబట్టి గడువు లోగా రైతులందరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ సారిక పిలుపునిచ్చారు.

# అంబేడ్కర్ భవనంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయండి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కుచాడి శ్రీహరి రావు వినతి**

**- వసతుల కల్పనకు రూ. 30 లక్షల నిధుల మంజూరుపై హామీ**



**ముధోల్(నిర్మల్ టౌన్), సెప్టెంబర్ 23**

:నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రత్యేకంగా ఒక 'స్టడీ సర్కిల్' ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కుచాడి శ్రీహరిరావు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శ్రీహరి రావు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలుసుకుంది.ఈ సందర్భంగా భవనం ప్రస్తుత పరిస్థితిని మంత్రికి వివరించి, వసతుల కల్పనకై ఒక వినతి పత్రాన్ని అందజేశారు.భవనం లోపల ప్రతిధ్వని (ఎకో) నివారణ చర్యలు చేపట్టాలని, విచ్చేసే అతిథుల సౌకర్యార్థం కుర్చీలు, ఇతరత్రా అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్టడీ సర్కిల్ ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని ఆ వినతి పత్రంలో వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, భవన ఆధునికీకరణకు అవసరమైన రూ.30 లక్షల నిధులను వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీహరి రావు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు కొంతం మురళీధర్, మధుకర్,అనిల్ తదితరులు ఉన్నారు.

# వరి కొనుగోళ్లు చురుగ్గా సాగాలి: అధికారులకు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదేశం..



**ముధోల్(నిర్మల్), సెప్టెంబర్ 23 :** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని జిల్లాల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన అదనపు కలెక్టర్లు,వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ వంటి కీలక అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి ఆయన సమగ్రంగా సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాల్లో తగినన్ని లారీలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, హమాలీలతో పాటు అవసరమైన అన్ని రకాల సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# శాస్త్రీయ నృత్యాలతో అలరించిన చిన్నారులు

**- వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు**

**- కూచిపూడి, భరతనాట్యంతో భక్తులను మెప్పించిన సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ**




**కుత్బుల్లాపూర్/బాచుపల్లి , సెప్టెంబర్ 23**

క్రాంతినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు వేడుకల్లో భాగంగా సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ చిన్నారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరించారు.వినాయకుడి స్తుతి, అమ్మవారి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల హావభావాలు, నృత్య విన్యాసాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.చిన్న వయస్సు నుంచే పిల్లల్లో భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంపొందించడమే తమ లక్ష్యమని అకాడమీ గురువులు తెలిపారు. శాస్త్రీయ నృత్యంతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో క్రాంతినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ నెట్‌వర్క్ ఆర్థిక మూలాలపై ఈగల్ ఫోర్స్ దాడి

**రూ.25 లక్షల విలువైన చరాస్తుల ఫోర్‌ఫీచర్.. 'డబ్బు ప్రవాహాన్ని అనుసరించి' నెట్‌వర్క్‌ను ఛేదించే దిశగా చర్యలు**

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఆర్థిక మూలాలను గుర్తించే దిశగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ చర్యలు చేపట్టింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎడుల్లబయ్యారం పోలీసులు, డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా వచ్చినట్లు ఆరోపణలు ఉన్న ఆదాయంతో సంబంధం ఉన్న సుమారు రూ.25 లక్షల విలువైన చరాస్తులను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియలో భాగంగా ఫోర్‌ఫీచర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ చర్య ఎడుల్లబయ్యారం పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 136/2021 కేసుకు సంబంధించినది. ఈ కేసులో ఎన్డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్లు 8(సి) ఆర్/డబ్ల్యూ 22(బి)(ఐఐ)(సి), 27(ఎ), 29 కింద కేసు నమోదు చేశారు.

**50 కిలోల గంజాయి.. మూడు కార్ల స్వాధీనం**

కేసు దర్యాప్తులో పల్లపు రఘుతో పాటు పలువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 50 కిలోల గంజాయి, దాని విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేయడంతో పాటు మూడు కార్లు---రెండు స్విఫ్ట్ డిజైర్లు, ఒక టాటా ఇండికా---స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.తదుపరి దర్యాప్తును కేవలం మాదకద్రవ్యాల స్వాధీనానికే పరిమితం చేయకుండా నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల యాజమాన్యం, సంబంధిత వ్యక్తుల ఆర్థిక వ్యవహారాలపై కూడా విస్తరించినట్లు పోలీసులు తెలిపారు.

**'ఫాలో ద మనీ' విధానంతో దర్యాప్తు**

ఆర్గనైజ్డ్ డ్రగ్ ట్రాఫికింగ్‌లో అక్రమ ఆర్థిక లాభాలు కీలకంగా ఉండటంతో పోలీసులు 'ఫాలో ద మనీ' విధానాన్ని అనుసరించినట్లు వెల్లడించారు. నిందితులు, వారి సహచరులు, బంధువులకు సంబంధించిన ఆర్థిక, యాజమాన్య వివరాలను



పరిశీలించినట్లు తెలిపారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా వచ్చినట్లు ఆరోపణలు ఉన్న ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేశారా అనే అంశాన్ని నిర్ధారించేందుకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, కొనుగోలు ఇన్‌వాయిస్‌లు, ఇతర పత్రాలను పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రక్రియలో ఆస్తుల యాజమాన్యం, వాటి ఆర్థిక లావాదేవీలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

**రూ.25 లక్షల చరాస్తుల ఫోర్‌ఫీచర్**

దర్యాప్తులో పల్లపు రఘు, అతని సహచరులు, బంధువులకు చెందినవిగా గుర్తించిన మహీంద్రా ఎక్స్‌యూవీ500, ఇన్నోవా, టీవీఎస్ జూపిటర్ వాహనాల విలువ సుమారు రూ.25 లక్షలుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఆస్తులు మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా వచ్చినట్లు ఆరోపణలు ఉన్న అక్రమ ఆదాయంతో సంబంధం కలిగి ఉన్నాయనే అంశంపై ఆర్థిక దర్యాప్తు నిర్వహించినట్లు పేర్కొన్నారు. చెన్నైలోని సంబంధిత సమర్థ అధికారి ధృవీకరణ అనంతరం 22-09-2026న ఎన్డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68(ఎఫ్) కింద ఆస్తులను ఫోర్‌ఫీచర్ చేసినట్లు తెలిపారు.

**డ్రగ్స్‌తో పాటు అక్రమ సంపదపైనా నిఘా**

మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వాటి వెనుక ఉన్న ఆర్థిక వ్యవస్థను గుర్తించడం కూడా దర్యాప్తులో భాగమని పోలీసులు తెలిపారు. డ్రగ్స్ కొనుగోలు, రవాణా, పంపిణీ, ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆదాయంతో ఆస్తుల సమీకరణ వంటి అంశాలను పరిశీలి స్తున్నట్లు పేర్కొన్నారు.అక్రమ ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందనే దానితో పాటు అది ఎక్కడికి ప్రవహించింది, ఎలాంటి ఆస్తులుగా మారింది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**ప్రజలకు ఈగల్ ఫోర్స్ విజ్ఞప్తి**

మాదకద్రవ్యాల కొనుగోలు, రవాణా, నిల్వ, విక్రయం, పంపిణీ లేదా వాటికి సంబంధించిన ఆర్థిక సహకారంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఈగల్ ఫోర్స్ ప్రజలను కోరింది. ముఖ్యంగా యువతకు మాదకద్రవ్యాలు చేరకుండా నిరోధించేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొంది.

డ్రగ్స్ సంబంధిత సమాచారం కోసం:

టోల్‌ఫ్రీ: 1908

వాట్సాప్: 87126 71111

ఈ-మెయిల్: tsnabho-hyd@tspolice.gov.in

సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, విశ్వసనీయ సమాచారదాతలకు తగిన విధంగా ప్రోత్సాహకం అందిస్తామని ఈగల్ ఫోర్స్ తెలిపింది.ఈ కేసులో తదుపరి దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు చట్ట ప్రకారం కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

# గణేశ్ వేడుకల్లో మత సామరస్యం: భక్తులకు ప్రసాద పంపిణీ చేసిన ఉప సర్పంచ్ ఫరూక్



**ముధోల్ (తానూర్), సెప్టెంబరు 23**

మండల కేంద్రంలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మత సామరస్యానికి అద్దంపట్టే అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది.తానూర్ ఉప సర్పంచ్ ఫరూక్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక మండపం వద్ద భక్తులకు, చిన్నారులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ..సమాజంలో హిందూ, ముస్లిం అనే భేదభావం లేకుండా అందరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలన్నారు. పండగలు, ఉత్సవాలు మానవ సంబంధాలను, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, భక్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్తీ అల్లం--వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

**730 కిలోల అనుమానిత కల్తీ పేస్ట్ స్వాధీనం.. తయారీదారు అరెస్ట్**







**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అనుమానిత కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై మల్కాజ్‌గిరి పోలీసులు చర్యలు చేపట్టారు. మల్కాజ్‌గిరి ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (ఎం-ఫాస్ట్), ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ టీమ్, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో సుమారు 730 కిలోల అల్లం--వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకుని, తయారీదారు ఆకుల శివయ్యను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 22న విశ్వసనీయ సమాచారం మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివశక్తి నగర్‌లో ఉన్న శ్రీ మణికంఠ (ఎస్ఎంకే) గోల్డెన్ ఫుడ్ ప్రొడక్ట్స్ అండ్ జింజర్--గార్లిక్ పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి నిర్వహించారు.అక్కడ అల్లం--వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ఆకుల శివయ్య (38)ను అదుపులోకి తీసుకుని విచారించినట్లు పోలీసులు తెలిపారు. వివిధ పరిమాణాల్లో ప్యాక్ చేసి పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

**730 కిలోల పేస్ట్ స్వాధీనం**

దాడిలో 50 కిలోల చొప్పున 13 డ్రమ్ముల్లో ఉన్న 650 కిలోల పేస్ట్, 5 కిలోల చొప్పున 10 బాక్సుల్లో ఉన్న 50 కిలోలు, 200 గ్రాముల చొప్పున 150 బాక్సుల్లో ఉన్న 30 కిలోల పేస్టు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం సుమారు 730 కిలోల అల్లం--వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు.అదనంగా 3.5 లీటర్ల గుర్తుతెలియని ద్రావణం ఉన్న తెల్ల బాటిల్, పేరులేని ఫుడ్ కలర్ బాక్స్‌ను కూడా స్వాధీనం



చేసుకున్నట్లు తెలిపారు.

**అపరిశుభ్ర వాతావరణంలో తయారీ?**

తయారీ కేంద్రాన్ని పరిశీలించగా తక్కువ నాణ్యత కలిగిన ముడి పదార్థాలు, గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్ వంటి పదార్థాలు లభించాయని పోలీసులు తెలిపారు. పేస్ట్‌ను అవసరమైన ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు పేర్కొన్నారు.ఇలాంటి అనుమానిత కల్తీ ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల ఆహార విషబాధ, కడుపు సంబంధిత అనారోగ్యాలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, అనుమానిత కల్తీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి వెళ్లకుండా నిరోధించడమే ఈ దాడి ఉద్దేశమని వెల్లడించారు.ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1534/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 223, 274, 275 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కల్తీ ఆహారంపై కఠిన చర్యలు**

ఆహార పదార్థాల కల్తీ, అక్రమ తయారీ, అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహార ఉత్పత్తుల తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి పోలీసులు తెలిపారు. అనుమానాస్పద లేదా అపరిశుభ్ర ఆహార తయారీ, నిల్వ, విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ దాడి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, అదనపు డీసీపీ ఎం.డి. షకీర్ హుస్సేన్ మార్గదర్శకత్వంలో జరిగింది. వనస్థలిపురం ఏసీపీ పి. కాశీ రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ చ. శంకరయ్య, ఎస్ఓటీ ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి, ఎం-ఫాస్ట్ ఎస్ఓటీ బృందం, హయత్‌నగర్ పోలీస్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మోక్ష కర్ర గణపతిని దర్శించుకున్న జోహార్ పూర్ గ్రామ సర్పంచ్ గైని దయానంద్



**ముధోల్(లోకేశ్వరం), సెప్టెంబర్ 23:** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అబ్దుల్లాపూర్ గ్రామ మోక్ష కర్ర గణపతిని జోహార్ పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గైని దయానంద్ బుధవారం నాడు తన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేకపూజలు, నిర్వహించి .ఈ సందర్భంగా సర్పంచ్ గైని దయానంద్ మాట్లాడుతూ... పర్యావరణ హితంగా, ఒకే ఊరు-ఒకే గణపతి అనే ఐక్యతతో దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్న అబ్దుల్లాపూర్ గ్రామస్తుల భక్తిశ్రద్ధలు అభినందనీయమన్నారు. ఈ వినాయక నవరాత్రుల వేళ మోక్ష కర్ర గణపతి ఆశీస్సులతో జోహార్ పూర్ మరియు అబ్దుల్లాపూర్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, లఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నార.

# కుటుంబ సమేతంగా ఖైరతాబాద్ బడా గణేశుడిని దర్శించుకున్న హైదరాబాద్ సీపీ

**- ప్రజల సుఖసంతోషాలు, నగర శాంతిభద్రతల కోసం ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఐపీఎస్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఖైరతాబాద్ బడా గణేశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు, వేద పండితులు సీపీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు.కుటుంబ సభ్యులతో కలిసి మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సీపీ, అనంతరం మహామంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, హైదరాబాద్ నగరం శాంతిభద్రతలతో ప్రశాంతంగా కొనసాగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా ప్రత్యేక



గుర్తింపు పొందిన ఖైరతాబాద్ బడా గణేశుడిని ఇప్పటివరకు సుమారు 25 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు సీపీ వెల్లడించారు.భక్తుల దర్శనానికి సంబంధించి మాట్లాడుతూ బుధవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి దర్శనాలకు అనుమతి ఉండదని తెలిపారు. శుక్రవారం నిర్వహించే గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులు దర్శించుకోవచ్చని పేర్కొన్నారు.గణేష్ శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా నగర ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ వీసీ సజ్జనార్ కోరారు.

# పనీర్, స్వీట్ల తయారీలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై దాడులు

**--చింతిస్తున్న ఆహార పదార్థాల తయారీపై ఎస్ఓటీ**
**--ఎంఫాస్ట్ సంయుక్త తనిఖీలు.. భారీగా పదార్థాల స్వాధీనం**










**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)** ఆహార పదార్థాల తయారీ, ప్రాసెసింగ్‌లో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్న సమాచారంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్ఓటీ మల్కాజిగిరి టీమ్--2, మల్కాజిగిరి ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (ఎంఫాస్ట్) సంయుక్తంగా దాడులు, తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో పనీర్, స్వీట్ల తయారీకి ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్న భారీ మొత్తంలో స్కిమ్డ్ మిల్క్ పౌడర్, ఇతర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

**స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌తో పనీర్ తయారీ?**

22 సెప్టెంబర్ 2026 ఉదయం 10 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లిలో ఉన్న నటరాజ్ మిల్క్ అండ్ మిల్క్ ఫుడ్ ప్రొడక్ట్స్ యూనిట్‌పై ఎస్ఓటీ మల్కాజిగిరి టీమ్--2, ఎంఫాస్ట్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి.తనిఖీల సమయంలో యూనిట్‌లో పనీర్ తయారీ ప్రక్రియను పరిశీలించగా, జపాల నటరాజ్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను కలిపి పనీర్ తయారు చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ తయారీ విధానం, అందుబాటులో ఉన్న పదార్థాలపై ఆహార భద్రత, నాణ్యత, కూర్పు, తయారీ ప్రమాణాలకు సంబంధించి అనుమానాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో సుమారు 500 కిలోల లూజ్ పనీర్, సుమారు 50 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. జపాల నటరాజ్‌ను స్వాధీనం చేసుకున్న పదార్థాలతో కలిసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం అల్వాల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

**స్వీట్ల తయారీ కేంద్రంలోనూ తనిఖీలు**

అదే రోజు తదుపరి విచారణలో లభించిన సమాచారంతో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేట్ గ్రామం సర్వే నంబర్ 189లో ఉన్న యశోద స్వీట్ అండ్ నమ్కీన్ కేంద్రంలోనూ ఎస్ఓటీ టీమ్--2, ఎంఫాస్ట్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి.స్వీట్ల తయారీలో పెద్ద మొత్తంలో స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌తో పాటు నూనె, డాల్డా/వెజిటబుల్ ఫ్యాట్ వినియోగిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తయారీ విధానం, వినియోగిస్తున్న పదార్థాల పరిమాణం, స్వభావంపై ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించి తదుపరి పరిశీలన అవసరమని పేర్కొన్నారు.తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన స్కిమ్డ్ మిల్క్ పౌడర్, యశోద స్వీట్ హల్వా, ఫ్రీడమ్ ఆయిల్, డాల్డా తదితర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్న పదార్థాలు**

- శ్రేద్ధి ప్రీమియం గోల్డ్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- సుమారు 35 బ్యాగులు
- రామ్సన్స్ స్ప్రే డ్రైడ్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- సుమారు 35 బ్యాగులు
- ధోల్‌పూర్ ఫ్రెష్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- 6 బ్యాగులు
- జ్ఞాన్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- 4 బ్యాగులు
- లాక్టో విన్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- 1 బ్యాగ్
- సవారియా స్కిమ్డ్ మిల్క్ పౌడర్ -- 1 బ్యాగ్
- యశోద స్వీట్ హల్వా -- సుమారు 21 కిలోలు
- ఫ్రీడమ్ ఆయిల్ -- సుమారు 100 టిన్లు
- డాల్డా -- సుమారు 50 టిన్లు

యశోద స్వీట్ అండ్ నమ్కీన్ ఇన్‌చార్జి పుష్పేంద్ర బఘేల్‌ను స్వాధీనం చేసుకున్న పదార్థాలతో కలిసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

**వినియోగదారుల భద్రతే లక్ష్యం**

ప్రజలు వినియోగించే ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా లేదా అనుమానాస్పద పద్ధతుల్లో తయారీ జరుగుతుందన్న సమాచారంపై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలపై సంబంధిత ఆహార భద్రతా నిబంధనల ప్రకారం తదుపరి పరిశీలన, చట్టపరమైన చర్యలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.ఈ సంయుక్త దాడులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి , మల్కాజిగిరి జోన్ డీసీపీ శ్రీధర్ , ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ పర్యవేక్షణలో జరిగాయి. ఎస్ఓటీ మల్కాజిగిరి టీమ్--2 ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డితో పాటు ఎస్ఓటీ, ఎంఫాస్ట్ బృందాలు ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

# రైతులందరూ 'ఫార్మర్ ఐడీ' చేసుకోవాలి: తరోడా క్లస్టర్ ఏఈఓ భూమేష్



**ముధోల్,సెప్టెంబర్ 23** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అగ్రి స్టాక్' రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను తరోడా క్లస్టర్ పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) భూమేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల సెప్టెంబర్ 22 నుండి 30 వరకు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఏఈఓ భూమేష్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడానికి ఈ డిజిటల్ గుర్తింపు కార్డు ఎంతో కీలకమన్నారు.

**ఫార్మర్ ఐడీతో కలిగే ప్రయోజనాలు**

వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటల కనీస మద్దతు ధర (మీఎస్పీ) కొనుగోళ్లకు ఇది తప్పనిసరి.బ్యాంకుల ద్వారా సులభంగా పంట రుణాలు పొందవచ్చు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు, సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయి.ఎఫ్ఎఫ్ఎస్ (ఫీఫీఎ) యాప్ ద్వారా ఎరువుల కొనుగోళ్లకు వీలుంటుంది.కావలసిన పత్రాలు:రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, మరియు ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని గానీ లేదా మీ సేవ కేంద్రాన్ని గానీ సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులు, తమ ఆధార్ నెంబర్ నమోదు చేసి 'రైతు ఐడీ నెంబర్' డౌన్లోడ్ చేసుకోవచ్చని ఏఈఓ భూమేష్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని క్లస్టర్ పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కలగాలి

**- కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్**
**- ఎంపేడులో వినాయకుని లడ్డూను రూ.29,516లకు దక్కించుకున్న కోటగిరి స్వర్ణలత--సతీష్ దంపతులు**



**టేకుమట్ల.సెప్టెంబర్ 23** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఎంపేడు గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోశమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన కోటగిరి స్వర్ణలత--సతీష్ గౌడ్ దంపతులు రూ.29,516లకు గణపతి ప్రసాదమైన లడ్డూను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ, విఘ్నేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో ఎంపేడు గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో, పిల్లాపాపలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్తమాన ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హుడైన లబ్ధిదారునికి అందేలా భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉంటూ మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భారీ మెజారిటీతో గెలుపొంది, ప్రజా ప్రభుత్వంలో మంత్రి పదవిని చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ వేలంపాట,వినాయక ఉత్సవ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణపయ్యకు ఘనంగా వీడ్కోలు.



రూ.1.35 లక్షలకు లడ్డును దక్కించుకున్న వినోద్‌రెడ్డి దంపతులు.



**జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

కొన్ని రోజులుగా భక్తుల పూజలు అందుకున్న గణనాథుడి చెంత ఉంచిన లడ్డూకు భక్తుల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన ఈ లడ్డూను దక్కించుకోవడం భక్తులందరూ అదృష్టంగా, శుభప్రదంగా భావిస్తూ వేలంలో పోటీపడుతుంటారు. ఈ నేపథ్యంలో రహమత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన గణపతి లడ్డూ వేలం ఆసక్తికరంగా సాగింది.రహమత్‌నగర్ డివిజన్‌లోని జై కృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. గత కొన్ని రోజులుగా గణనాథుడి పాదాల చెంత ఉంచి భక్తుల పూజలు అందుకున్న లడ్డూను సొంతం చేసుకునేందుకు స్థానికులు, భక్తులు ఉత్సాహంగా వేలంలో పాల్గొన్నారు. లడ్డూకు ఉన్న ప్రత్యేకత, గణనాథుడి ఆశీస్సులకు ప్రతీకగా భావిస్తుండటంతో వేలం ప్రారంభం నుంచే పోటీ నెలకొంది. ఒకరిని మించి మరొకరు వేలం పాడడంతో ఉత్కంఠభరితంగా సాగిన వేలం చివరకు వినోద,రామిరెడ్డి దంపతుల వద్ద ముగిసింది. వారు రూ.1,35,000లకు లడ్డూను దక్కించుకున్నారు.వేలంలో లడ్డూను దక్కించుకున్న దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. "కొన్ని రోజులుగా గణనాథుడి చెంత పూజలందుకున్న లడ్డూ మా కుటుంబానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గణపతి ఆశీస్సులు మా కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.

అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం

లడ్డూ వేలం అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీజే సంగీతం, ఆటపాటలు, నృత్యాలతో భక్తులు సందడి చేస్తుండగా గణనాథుడి ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ భక్తులు స్వామివారిపై ఉన్న భక్తిని చాటుకన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, చిన్న రాజు, నానీశ్వర్, కిరణ్ కుమార్, సహర్ష్, సాయిరామ్, కవిత, ప్రసన్నలత, గీత శ్రీ, రుథిక , జై కృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు యువత పాల్గొన్నారు.

# నిమజ్జనానికి వేళాయె!.. ఉప్పల్‌లో గణనాథులకు వీడ్కోలు

**భక్తిశ్రద్ధలతో సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు**
**డప్పు చప్పుళ్లు.. భజనల నడుమ నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు**
**ట్రాఫిక్, భద్రతపై పోలీసుల ప్రత్యేక నిఘా**



**గ్రేటర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23 :** తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథులకు వీడ్కోలు పలికే వేళ వచ్చింది. ఉప్పల్ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగాయి. మండపాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, నైవేద్యాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, భక్తిగీతాలతో ఆయా ప్రాంతాలు గణపతి నామస్మరణతో మార్మోగాయి.నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో బుధవారం పలు మండపాల నుంచి గణేశ్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పుళ్లు, భక్తుల నృత్యాలు, గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య శోభాయాత్రలు సందడిగా సాగాయి. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు.నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రధాన మార్గాలను పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది నిమజ్జన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలని అధికారులు సూచించారు.

# భవనం నిర్మాణంలో ఉండగా స్కూల్ రన్.

- విద్యార్థులకు భద్రత కరువు..!
- ఒకే స్కూల్ రెండు పేర్లతో చెలామణి ?




**కుత్బుల్లాపూర్ , సెప్టెంబర్ 23 (పీపుల్స్ న్యూస్)**

భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నీతి, నైతిక విలువలను బోధిస్తుంటాయి. అయితే అదే విద్యాసంస్థల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళన కలిగించే విషయం. సూరారం శ్రీకృష్ణానగర్‌లోని రేడియంటల్ స్కూల్ (శ్రీ విజ్ఞాన్ విద్యా నికేతన్) విషయంలో ప్రస్తుతం ఇదే తరహా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాలలపై ఎంతో నమ్మకం ఉంచుతారు. ఉదయం ఇంటి నుంచి పంపించిన తమ పిల్లలు సాయంత్రం క్షేమంగా తిరిగి




వస్తారనే విశ్వాసంతో వారిని పాఠశాలకు పంపిస్తారు. ముఖ్యంగా పాఠశాల భవనం, తరగతి గదులు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో యాజమాన్యం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని తల్లిదండ్రులు భావిస్తారు.

**పాత భవనంపై కొత్త అంతస్తుల నిర్మాణం?**

స్థానికుల సమాచారం ప్రకారం.. కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన భవనంలో పాఠశాల కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో, అదే భవనంపై మరో రెండు అంతస్తులు నిర్మాణం చేశారు. ఒక వైపు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ, మరోవైపు అదే భవనంలోని పాత అంతస్తుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ ప్రాంతంలో ఇనుప రాడ్లు, సిమెంట్, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి, కార్మికుల రాకపోకలు ఉంటాయి. ఇలాంటి సమయంలో చిన్నారులు అదే భవనంలో తరగతులకు నిర్వహించడం అత్యంత ప్రమాదకరం. కొత్తగా రెండు అంతస్తులు నిర్మించేందుకు సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నారా? భవనం నిర్మాణానికి మంజూరైన ప్లాన్‌లో అదనపు అంతస్తులకు అనుమతి ఉందా? భవనం ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల అవసరాలకు, అదనపు నిర్మాణానికి సంబంధించిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలను పక్కన పెట్టి కేవలం ధనార్జన లక్ష్యంగా పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోంది. ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతుండగా మరోవైపు అదే భవనంలో చిన్నారులకు పాఠాలు చెప్పడం ఎంతవరకు సురక్షితం అన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**విద్యార్థుల భద్రత దృష్ట్యా భవనం సీజ్ చేయాలి.**

సూరారం శ్రీ కృష్ణా నగర్‌లో కొనసాగుతున్న ఓ పాఠశాల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొంది. ఒకే భవనంపై 'రేడియేంటల్ స్కూల్', 'శ్రీ విజ్ఞాన్ విద్యానికేతన్' అనే రెండు పేర్లు కనిపించడంతో అసలు పాఠశాల ఏ పేరుతో కొనసాగుతోంది? ఏ విద్యా సంస్థకు అనుమతులు ఉన్నాయి? ఏ యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహిస్తున్నారు? అనే ప్రశ్నలు తల్లిదండ్రుల్లో తలెత్తుతున్నాయి. గత రెండు రోజులుగా ఈ అంశంపై వరుసగా కథనాలు వెలువడటంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఎంఈఓ సంబంధిత పాఠశాలను సందర్శించి భవనంపై ఏర్పాటు చేసిన 'రేడియేంటల్ స్కూల్' బోర్డును తొలగించినట్లు తెలిసింది. పాఠశాల భవనంలో నిర్మాణ పనులు జరుగుతున్న అం శంపై మున్సిపల్ అధికారులు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణానికి అను మతులు ఉన్నాయా? అనుమతులకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? పాఠశాల నిర్వహణకు, నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉందని వారు కోరుతున్నారు. విద్యార్థులు నిత్యం తరగతులు హాజరవుతున్న భవనంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి భవనాన్ని సీజ్ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి..

- మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 :**

మహబూబ్‌నగర్ పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రజలు, నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జనోత్సవం జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలు విధిగా పాటించాల్సిన కొన్ని కీలకమైన అంశాలను ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ..?ఉత్సవాల్లో డీజేల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని డీఎస్పీ తెలిపారు. అధిక శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులపాలయ్యే అవకాశం ఉన్నందున నిబంధనలను అందరూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అదేవిధంగా, నిమజ్జన ప్రాంతాల వద్ద నీటిలో ఎవరూ అతిగా లోతుకు వెళ్లవద్దని హెచ్చరించారు. అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పాటిస్తూ, ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండి అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు.

?విగ్రహాల తరలింపు మరియు ఊరేగింపు సమయంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చిన్నచోట కూడా విద్యుత్ ప్రమాదాలకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక నిమజ్జన వేడుకల్లో భాగంగా ఎవరూ మద్యం సేవించి పాల్గొనరాదని, ముఖ్యంగా యువకులు మరియు వాహనాలు నడిపేవారు ఈ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణరక్షణకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారని, పండుగను అందరూ సంతోషంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముగించుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

# రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

- వర్ధన్నపేట బీసీ సంక్షేమ పాఠశాలలో ఆర్టీఏ అవగాహన
- మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై వివరణ
- ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు

**వర్ధన్నపేట, సెప్టెంబర్ 23 :** రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఆర్టీఏ అధికారులు తెలిపారు. వర్ధన్నపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ పాఠశాలలో ఆర్టీఏ హనుమకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, శ్రావణ్, శ్రావ్య పాల్గొని ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణంపై విద్యార్థులకు వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలు



మోటారు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన సందర్భాల్లో ప్రమాదాలతో పాటు వాహన యజమానులు, తల్లిదండ్రులు చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో బాధితులకు సహాయం అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం పెరుగుతుందని వివరించారు. గుడ్ సమారిటన్‌గా ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ద్విచక్ర వాహనంపై హెల్మెట్, కారులో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, అతివేగం, డ్రైవింగ్ సమయ ంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లోనూ అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు,

లక్ష రూపాయల జరిమానా - వికారాబాద్ జిల్లా ఎస్పీ



**పరిగి, సెప్టెంబర్ 24 :** పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలనాత్మక హత్య కేసుకు సంబంధించి గౌరవ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నేరానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఆమె వెల్లడించారు. ?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ... మహిళలపై అఘాయిత్యాలకు, హత్యలకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని, అటువంటి వారికి చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్షలు పడేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ?ఈ కేసులో పోలీసులు అత్యంత ప్రతిభావంతులుగా వ్యవహరించారని ఎస్పీ కొనియాడారు. సంఘటన జరిగిన వెంటనే కేసు నమోదు చేసి, ఎనుబడిన ఆధారాలను పక్కాగా సేకరించామని పేర్కొన్నారు. వైద్యపరమైన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు భౌతిక సాక్ష్యాలను కోర్టులో పటిష్టంగా ప్రవేశపెట్టడం వల్లే నిందితుడికి త్వరగా శిక్ష పడేలా చేయగలిగామని తెలిపారు. ?దర్యాప్తు దశ నుండి తుది తీర్పు వెలువడే వరకు నిబద్ధతతో పనిచేసిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ సిబ్బంది మరియు ఇతర పోలీసు అధికారులందరినీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో, మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసు శాఖ ఎప్పుడూ ముందుంటుందని, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా పకడ్బందీ చర్యలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు.

# రైతుల పంట నిల్వకు.. రూ.7 కోట్ల భరోసా

- తాడ్వాయిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము
- ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలి: మంత్రి సీతక్క
- గిరిజన ఆవాసాల్లో సీసీ రోడ్లకు రూ.50 కోట్లు
- మారుమూల గూడాల్లో సొం
- విద్యుత్‌తో వెలుగులు

**ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23**

రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు సురక్షిత నిల్వ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ. 7 కోట్లతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాముకు ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ నిల్వ వసతులు లేక రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందని, అకాల వర్షాలతో పంట తడిసి నష్టపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా తాడ్వాయిలో భారీ గోదాము నిర్మిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో మరో గోదాము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులను



ఆదేశించారు. వచ్చే వర్షాకాలానికి ముందే పనులు పూర్తికావాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారుల నిర్మాణానికి సుమారు రూ. 50 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గూడాల్లో సౌర విద్యుత్‌తో ఇంటింటికీ వెలుగులు, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పది రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. మహిళా సంఘాలు ముందుకొస్తే ఐదు నుంచి పది ఎకరాల్లో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తామని, వాటి ద్వారా సంఘాలకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల వారీగా రూ. 50 లక్షల విలువైన ప్రజోపయోగ పనులు చేపట్టే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కీచక ఉపాధ్యాయుడు అరెస్ట్..

**పరిగి, సెప్టెంబర్ 24 :**



విద్యార్థులను వేధిస్తున్న కీచక ఉపాధ్యాయుడు అరెస్ట్.. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో తీవ్ర కలకలం రేపిన ఒక అమానుష ఘటనలో, విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరిగి పట్టణంలోని ఒక ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆ వ్యక్తి, విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పించి మంచి బాటలో నడిపించాల్సిన గురుతర బాధ్యతను పూర్తిగా విస్మరించాడు. బడికి వచ్చే పసిపిల్లలను రక్షించాల్సింది పోయి, వారితోనే అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పైశాచికానందానికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయుడి ప్రవర్తనతో తీవ్ర మనోవేదనకు గురై, భయపడిపోయిన విద్యార్థులు ఎంతో ధైర్యం చేసి హాస్టల్ వార్డెన్‌కు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పిల్లల ద్వారా అసలు విషయం తెలుసుకున్న వార్డెన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అప్రమత్తమై స్థానిక పోలీసులకు సమగ్ర సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించి, నిందితుడైన ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు చట్టాల కింద కఠిన కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు అధికారికంగా తెలిపారు. సమాజంలో "గురుదేవో భవ" అంటూ దేవుడితో సమానంగా పూజించబడే ఉపాధ్యాయ వృత్తికి ఈ ఘటన మచ్చ తెచ్చిందని స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలను విజ్ఞానాలయాలుగా తీర్చిదిద్దాల్సిన చోట, కొందరు మృగాలలా ప్రవర్తించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. పసిపిల్లల భద్రతను గాలికొదిలేసే ఇలాంటి కామాంధులకు సమాజంలో నూకలు లేకుండా చేయాలని, వీరికి అత్యంత కఠినమైన శిక్ష పడితేనే భవిష్యత్తులో ఇలాంటి అరాచకాలు పునరావృతం కావని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com